ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శుక్రవారం 7 నవంబరు 2025

పోత్గల్ మార్కెట్ యార్డ్‌లోని సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ నాయకుల వినతి

సిరిసిల్ల టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండలం పోత్గల్‌లోని మార్కెట్ యార్డ్‌లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ కార్యాలయంలోని ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడారు. పోత్గల్‌లో ఐదు ఎకరాల స్థలంలో మార్కెట్ యార్డును నిర్మించి చేతులు దులుపుకున్నారని అన్నారు. యార్డులో ఎత్తుపల్లాలు ఉండడంతో రైతులు ధాన్యం ఆరబోయడం కష్టంగా మారిందన్నారు. యార్డులో కనీసం టాయిలెట్స్ కూడా లేవన్నారు. ఏ చిన్నపాటి వర్షం పడిన యార్డ్ బురదమయం అవుతుందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో యార్డ్ చుట్టూ కట్టిన ప్రహరీ ఒకవైపు పడిపోయిందని ఆరోపించారు. గత పదేళ్లుగా యార్డ్ కేవలం ఎలక్ట్రానిక్ తూకాలు, టార్పాలిన్లు సరఫరా చేయడానికి మాత్రం ఉపయోగపడుతుందన్నారు. పోత్గల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నియామకం లేకపోవడంతో తరచూ గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంటకు చెందిన కార్యదర్శులు ఇన్‌చార్జీలుగా వ్యవహరించడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆరోపించారు. వ్యసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం కోటి 80 లక్షలతో యార్డ్ అభివృద్ధి పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసినా నిధులు మాత్రం మంజూరు కాలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోత్గల్ ఏఎంసీ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమ నాగరాజు, జోగు నర్సయ్య పాల్గొన్నారు.



ఉపాధికి ఆధార్ లింక్

శాటిలైట్ ఆధారంగా పనులు నమోదు

ఉపాధిహామీ కింద చేపట్టే పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం సాంకేతికతను జోడిస్తుంది. ఉపాధిహామీ పథకం పనులను శాటిలైట్ ఆధారంగా గుర్తిస్తున్నారు. ఇప్పటివరకు భువన్ యాప్‌లో ప్రాంతాన్ని చూపి పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పనులు పూర్తయిన తర్వాత యాప్‌లో నమోదు చేస్తే సరిపోయేది. ఈ ఏడాది పనిచేస్తే మరో ఏడాది సామాజిక తనిఖీ తర్వాత మళ్లీ అక్కడే యాప్ వివరాలను తీసుకుంటుంది. కొత్తగా తీసుకొచ్చిన యుక్తధార యాప్‌లో నమోదు చేసే విధంగా చర్యలు ప్రారంభించారు. యుక్తధారలో వివరాలు నమోదు చేస్తే మరో ఏడాది అక్కడే పనులు చేసినట్లు చూపిన వివరాలు నమోదు కావు. దీంతో పనుల్లో పారదర్శకతతో పాటు పనుల వివరాలు అందుబాటులో ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

- జిల్లాలో వేగంగా ఈ-కేవైసీ ప్రక్రియ
- ఉపాధి పనుల్లో అవకతవకలకు చెక్
- జిల్లాలో 1.96 లక్షల మంది కూలీలు
- యాక్టివ్ లేబర్‌లో 86.87 శాతం ఈ-కేవైసీ పూర్తి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గ్రామాల్లో కూలీల వలసలను నిరోధించే దిశగా కేంద్ర ప్రభుత్వం 2005లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. వంద రోజుల పాటు కూలీలకు ఉపాధి పనులను పారదర్శకంగా కల్పించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం నూతన విధానాలను తీసుకువస్తోంది. ఇప్పటికే రాష్ట్రాలకు సంబంధం లేకుండా నేరుగా కూలీలకు వేతనాలు వారి ఖాతాలో జమ చేయడం, లేబర్ బడ్జెట్ ఇతర కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేక యాప్, పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. గ్రామాల్లో ఉపాధిహామీ జాబ్‌కార్డుల్లో నమోదైన కూలీలకు బదులుగా మరొకరు హాజరవుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో వాటిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ-కేవైసీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న ఉన్న 260 గ్రామపంచాయతీల్లో నిరంతరంగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. కానీ చాలామంది జాబ్ కార్డులు ఉన్నవారిలో పనులకు రావడం లేదు. జాబ్ కార్డులో పేర్లు నమోదు చేసుకున్న కుటుంబ సభ్యులు ఇతర ప్రాంతాల్లో పనులు చేస్తున్నవారు ఉన్నారు. వారి స్థానంలో ఇతరులు పనులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిని నివారించే దిశగా ఇప్పటికే పని ప్రదేశాల్లో ఫొటోలు తీసి అప్లోడ్ చేయడం చేస్తున్నారు. ఇంకా ఎలాంటి అవకతవకలకు చోటివ్వకుండా సాంకేతికతతో యాప్‌లను అందుబాటులోకి తెస్తున్న క్రమంలోనే కూలీలకు సంబంధించిన ఈ-కేవైసీని తీసుకొని ఆధార్‌ను అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతంగా చేస్తున్నారు.

జిల్లాలో 1.50 లక్షల మంది కూలీల ఈ-కేవైసీ పూర్తి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 97వేల జాబ్ కార్డులు ఉండగా, 1.96 లక్షల మంది ఉపాధి మిగతా 8వ పేజీలో..

జిల్లాలో ఈ-కేవైసీ వివరాలు

మండలం	కూలీలు	ఆధార్ అనుసంధానం
బోయిన్‌పల్లి	14,277	10,599
చందుర్తి	16,827	12,754
ఇల్లంతకుంట	20,254	16,364
గంభీరావుపేట్	26,989	17,943
కోనరావుపేట	23,391	21,092
ముస్తాబాద్	17,474	14,332
రుద్రంగి	6,001	4,382
తంగళ్లపల్లి	16,614	13,862
వీర్నపల్లి	9,709	7,562
వేములవాడ	7,126	4,608
వేములవాడరూరల్	10,258	8,236
ఎల్లారెడ్డిపేట	27,500	18,708
మొత్తం	1,96,420	1,50,442

తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

సిరిసిల్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సరైన తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా ఇన్‌చార్జి కలె క్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు, వసతు లు,ధాన్యం తరలింపు తదితర అంశాలపై ఐకేపీ, మెప్మా, పీఏసీఎస్ కేంద్రాల నిర్వాహకులతో గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలు పరిశీలించాలని, ఏమైనా స్థానిక ఇబ్బందులు పరిష్కరించాలని, ఇంకా ఏమైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. జిల్లాలో ఆయా కొనుగోలు కేంద్రాల్లో 37050 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్ర ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు

డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి

- వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



డ్రైవర్‌లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని వేములవాడ సబ్ డివిజనల్ అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఇటీవల పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల తీవ్రత దృష్ట్యా వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డుభద్రత నియమాలను పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనాల కండీషన్ ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలన్నారు. పరిమితికి లోబడి వాహనాల లోడ్ ఉండాలన్నారు. వాహనాలు నిర్లక్ష్యంగా నడుపడం, కండీషన్ లేని వాహనాలు నడపటంవల్ల నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవించి చాలా మంది ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ప్రధానంగా రాష్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్‌లోడ్, రాంగ్ రూట్, కండిషన్ లేని వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. ప్రధానంగా భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవడం లేదన్నారు. నిద్రమత్తు వల్ల ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. డ్రైవింగ్ అనేది వృత్తి మాత్రమే కాదని, అనేక కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడి ఉందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపడం, అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం మానుకోవాలన్నారు. ఈ సందర్భంగా భారీ వాహనాల డ్రైవర్‌లు పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రతపై డ్రైవర్‌లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సులో వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ సముద్రాల రాజు, ఎస్ఐ రామ్మోహన్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థి హేమను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చందుర్తి నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎర్రం హేమ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జితేందర్ గురువారం తెలిపారు. కొత్తపల్లిలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17 హ్యాండ్‌బాల్ బాలికల విభాగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించింది. ఈ పోటీల్లో విద్యార్థిని అత్యంత ప్రతిభ కనబరిచి ఈనెల 7నుంచి 9 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని కొస్గి నారాయణపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు జెట్టిపల్లి అశోక్ తెలిపారు. ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, జి.శ్రీనివాస్, లక్ష్మణ్, పావని, మహేష్, బన్నాజీ, ఈగ శ్రీనివాస్, మంద శ్రీనివాస్, కార్తీక్, సాగర్, అశోక్ విద్యార్థినిని అభినందించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి

- నోటికి నల్లగుడ్డలతో మౌనదీక్ష



సిరిసిల్లలో మౌన దీక్ష చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేస్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే దంపతుల విగ్రహం ఎదుట బీసీ సంక్షేమ సంఘం నాయకులు నోటికి నల్లగుడ్డలు ధరించి మౌనదీక్ష చేపట్టారు. అంతకు ముందు జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేస్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పూలే దంపతుల విగ్రహం ఎదుట బైటాయించి నోటికి నల్ల గుడ్డలు ధరించి మౌనదీక్షతో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి పార్లమెంట్ ఉభయ సభల్లో ఏకగ్రీవం తీర్మానం చేసి బిల్లును ఆమోదించాలన్నారు. రాజ్యాంగ సవరణ చేసి అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లపై చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు. అవసరమైతే ఢిల్లీలోని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇంటిని కూడా ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు తడక కమలాకర్, బోయిన శ్రీనివాస్, బూర అంజనేయులు, చెన్నమనేని రాజకుమార్, దుబాల కొండయ్య, తోట్ల రాములుయాదవ్, కందుకూరి రామాగౌడ్, తిరుపతి, రాజు, మల్లేశంయాదవ్, రవి, శ్రీనివాస్, సామల తిరుపతి, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- జిల్లాలో 70 శాతం మార్క్ ఔట్ పూర్తి.. - ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



లబ్ధిదారులకు వస్త్రాలను అందజేస్తున్న కలెక్టర్ గరిమా అగర్వాల్, కేకే



లబ్ధిదారులను అడ్డుకుంటున్న పోలీసులు

తంగళ్లపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో హౌసింగ్ శాఖ నిర్మించిన మోడల్ హౌస్‌తో పాటు మండేపల్లి, చింతలపల్లి, రాళ్లపేట, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో మొత్తం 11 ఇందిరమ్మ ఇళ్లు పూర్తికాగా గురువారం గృహ ప్రవేశాలు నిర్వహించారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు హాజరై ప్రారంభించారు. గృహ ప్రవేశాలు జరుపుకున్న కుటుంబాలకు కేకే మహేందర్‌రెడ్డి నూతన దుస్తులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ పేదల సొంత ఇంటి కల నేరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలుచేస్తోందన్నారు. ఆయా గ్రామాల్లో ఇండ్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. మిగతా లబ్ధిదారులు అందరూ ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని, ఆందోళన చేందవద్దని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, తహసీల్దార్ జయంత్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, నాయకులు గడ్డం నర్సయ్య, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, నాయకులు సత్తు శ్రీనివాస్‌రెడ్డి, మచ్చ శ్రీనివాస్, లింగాల భూపతి, మునిగెల రాజు, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, జుపెల్లి రాజేశ్వర్‌రావు, చుక్క శేఖర్, కట్కం రాజశేఖర్, గణాది కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి బిల్లు ఇప్పించండి..

ఇందిరమ్మ ఇంటి బిల్లు ఇప్పించాలని లబ్ధిదారులు మసరకంటి వెంకటలక్ష్మి-ఎల్లయ్య దంపతులు ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ ముందు మొకరిల్లారు. రాళ్లపేటలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి కాలినడకను ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు వెళుతుండగా బాధిత దంపతులు ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా పడుకుని బిల్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలీసులు తేరుకుని వారిని పక్కకు తీసుకపోయారు. ఈ విషయంపై ఆరాతీయగా 562 గజాల లోపు ఇంటి నిర్మాణం ఉన్నప్పటికీ నిబంధనల ప్రకారం లేదని బిల్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులను వివరణ కోరగా ఆధార్‌కార్డు నంబరు తప్పుగా నమోదు అయ్యిందని ఉన్నాతాధికారులకు నివేదించినట్లు, నెలరోజుల్లోపు సమస్య పరిష్కారమవుతుందన్నారు.

26న ఢిల్లీలో రాజ్యాంగ హక్కుల సాధన సభ

- జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మేడి అంజయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జాతీయ మాల మహానాడు నాయకులు రాజ్యాంగ హక్కుల సాధన సభ ఛలో ఢిల్లీ కరప్రత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ హక్కుల సాధన కోసం జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఈనెల 26న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రాజ్యాంగ హక్కుల సాధన సభను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని జాతీయ మాల మహానాడు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, నాయకులు ఎడ్ల రాజకుమార్, మారే కిషోర్, మంగ కిరణ్, ఏసు కుమార్, బండి శ్రావన్, బందెల సదానందం, జంగం నరేష్, రెడ్డి సురేష్, లింగాల దాసు, ఎడ్ల తిరుపతి, జీవానందం, చంటి ఎల్లయ్య, బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు చేయూత

గంభీరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలోని 'మా అనాథ వృద్ధుల ఆశ్రమం'లో వృద్ధులకు అవసరమయ్యే దినసరి వస్తువుల కిట్లను చీకోడ్ గ్రామానికి చెందిన సాయబుగారి నారాగౌడ్ గురువారం అందజేశారు. అనంతరం అల్పాహారం, పళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బంగ్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తిచేయాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ - వివిధ శాఖల పనుల పురోగతిపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ గరిమా అగర్వాల్

సిరిసిల్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో విద్యా శాఖ, పంచాయతీ, అంగన్‌వాడీ, ఆరోగ్య శాఖ భవనాలు, ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద జిల్లాలో మొదలు పెట్టిన పనులపై వివిధ శాఖల, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 49 అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరు కాగా, పలు భవనాలు పూర్తి కాగా, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా పనులను పూర్తి చేసి, పిల్లలను ఆకట్టుకునే రంగులు వేయాలని, నీటి వసతి మిషన్ భగీరథ ద్వారా కల్పించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ భవనాల పనులను వేగంగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. భవిత కేంద్రాల భవనాలపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని, గడువు పెట్టి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 13 కేజీబీవీల్లో మంజూరు అయిన అదనపు తరగతి గదులు, ఇతర మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చేయాలని సూచించారు. ఎంపీ ల్యాడ్స్ కింద జిల్లాకు మంజూరు అయిన పనులను వెంటనే మొదలు పెట్టి 15 రోజుల్లో పూర్తిచేయాలని తెలిపారు. పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పనులను పూర్తి చేసి, వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించాలని సూచించారు. ఇంకా మొదలు పెట్టని పనులకు వెంటనే టెండర్లు చేయాలని, గడువులోగా పూర్తిచేయించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, డీఈవో వినోద్‌కుమార్, పీఆర్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత, జీసీడీవో పద్మజ, డీపీవో షర్ఫుద్దీన్, సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట శివారులో రెండు ద్విచక్రవాహనాలు గురువారం ఢీకొన్నాయి. ఈ ఘటనలో గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట, ముచ్చర్ల గ్రామాలకు చెందిన లక్ష్మణ్, సంతోష్, నవీన్‌లకు గాయలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మల్లారెడ్డిపేట గ్రామంలోని లక్ష్మణ్, సంతోష్‌లు కలిసి బైక్‌పై రాచర్లగొల్లపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ముచ్చర్ల వాసి నవీన్ ద్విచక్రవాహనం ఢీకొన్నాయి.

నష్టపరిహారం అందజేత

కోనరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన తిక్కల జగన్ అనే గొర్ల కాపరికి సెస్ అధికారులు నష్టపరిహారం చెక్కును అందజేశారు. గతంలో జగన్‌కు చెందిన మేక విద్యుత్ షాక్‌తో మృతిచెందగా అతడికి నష్టపరిహారం చెక్కు మంజూరైంది. ఈ మేరకు సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి నష్టపరిహారం కింద 7 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో చెప్పాల శంకర్, నోముల లింగారెడ్డి, సెస్ ఏఈ తదితరులు ఉన్నారు.

భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం


భీమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు

వేములవాడ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో కార్తీక మాసంలో భాగంగా గురువారం రాత్రి కార్తీకదీపోత్సవం నిర్వహించారు. ఈ దీపోత్సవంలో భాగంగా సుహాసీనులు దీపాలను వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు, భజనలతో అలరించారు. కార్తీకదీపోత్సవంలో పాల్గొన్న సుహాసినులకు పసుపుకుంకుమ, అక్షింతలు, గాజులు, స్వామివారి ఫోటోతో కూడిన వాయినంను ఏఈవో అశోక్ అందజేశారు. ఈ ఉత్సవాల్లో సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ సాయి, గట్టు గౌతం, అర్చకులు పాల్గొన్నారు.

చిట్టీల వ్యాపారి అరెస్ట్

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధిక డబ్బులు వస్తాయని ఆశజూపి ప్రజల వద్ద నుండి చిట్టీల పేరున నిలువు దోపిడిచేసిన వ్యాపారిని పెద్దపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి పట్టణంలో సుమారు 40మంది నుండి నెలనెలా డబ్బులు తీసుకొని ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. డిసెంబర్ నుండి తప్పించుకొని తిరుగుతున్న పెద్దపల్లి భరత్‌నగర్‌కు చెందిన ఠాకూర్ హనుమాన్ ప్రసాద్ కోసం ప్రత్యేకంగా టీమ్‌ను ఏర్పాటు చేసి గురువారం అరెస్టు చేశారు. అతని బాధితులు ఎవరైనా ఉంటే పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.


వ్యాపారి అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

వంతెన పూర్తయ్యేదెన్నడో?

- రెండు నియోజకవర్గాల మధ్య రాకపోకలకు కీలకం
- అసంపూర్తిగా నిర్మాణ పనులు..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు

బోయినపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రెండు నియోజకవర్గాలను కలిపే వంతెన నిర్మాణానికి పట్టిన గ్రహణం వీడడం లేదు. ఈ వంతెన చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని గ్రామాల మధ్య రాకపోకలకు కీలకమైనది. వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టరేట్ వరకు పాదయాత్ర, బైక్ ర్యాలీ, ఆందోళనలు చేపట్టినా నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో ప్రభుత్వ తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోయినపల్లి మండల కేంద్రం నుంచి వేములవాడ పట్టణానికి వెళ్లే దారిలో గంజి వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి గతంలో ప్రారంభమయ్యాయి.అయితే కాంట్రాక్టర్ వంతెన నిర్మాణంలో భాగంగా పిల్లర్లు వేసి మధ్యలో నిలిపివేశాడు. చేసిన పనులకు లక్షలకు ఎంబీ రికార్డు అయినా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతోనే సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేసినట్టు సమాచారం. పనులను పూర్తిచేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీచేశారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో కొద్దిపాటి వర్షానికి గంజి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోతాయి. బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని పలుమార్లు ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశారు. పలుమార్లు ఆందోళనల తర్వాత అధికారులు వంతెన పక్కన తాత్కాలిక రోడ్డు వేయించారు. ఇటీవల కురిసిన వర్షానికి తాత్కాలిక రోడ్డు సైతం దెబ్బతిన్నది. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి మధ్యలో నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పాదయాత్ర చేస్తున్న ప్రజలు (ఫైల్)

ఏళ్లు గడుస్తునా పనులు ముందుకు సాగడం లేదు..


– అక్కనపల్లి కరుణాకర్, స్తంభంపల్లి

గంజివాగు హైలెవెల్ వంతెన నిర్మాణానికి సంవత్సరాలు గడుస్తున్నా పనులు ముందుకు లేదు. పనుల పూర్తికి కలెక్టరేట్ వరకు పాదయాత్రతో పాటు బైక్ ర్యాలీ నిర్వహించి ఆందోళనలు వ్త్రం చేశాం. అయినా పనులు ముందుకు సాగడం లేదు.

వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలి..


– బొంగోని అశోక్, స్తంభంపల్లి

కొద్దిపాటి వర్షానికి గంజి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు వేములవాడ పట్టణానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం స్పందించి వంతెన పనులు పూర్తి చేయాలి.

కాంట్రాక్టు రద్దుకు ప్రభుత్వానికి నివేదిక పంపించాం..

– కె విష్ణువర్ధన్, పీఆర్ డీఈ

పనులు పొందిన కాంట్రాక్టర్ నోటీసులు జారీచేసిన పనులను పూర్తి చేయడంలేదు. దీంతో కాంట్రాక్టు రద్దుకు ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ఆదేశాలు రాగానే మళ్లీ టెండర్ పిడిచి పనులను పూర్తి చేయిస్తాం.

టిప్పర్ సీజ్



టిప్పర్‌ను సీజ్ చేస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ చౌరస్తాలో గురువారం అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో డస్ట్ తీసుకెళుతున్న టిప్పర్‌ను సీజ్‌చేశారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎంవీయాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లు అందజేత

కరీంనగర్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో కమటం సాయికుమార్ అనే వ్యక్తి మార్చి 2వ తేదీన తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుని రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆఫోన్ జగిత్యాలలో ఉన్నదని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. గురువారం బాధితుడు సాయికుమార్‌ను స్టేషన్‌కు పిలిపించిన రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి ఫోన్‌ను అప్పగించారు. ఈ ఫోన్‌ను రికవరీ చేయడంలో కృషిచేసిన కరీంనగర్ రూరల్ కానిస్టేబుల్ కీర్తనను రూరల్‌సీఐ నిరంజన్ రెడ్డి అభినందించారు.

శంకరపట్నం: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బాధితుడికి కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్‌లో అప్లోడ్ చేయగా, వాటిని గుర్తించి పోగొట్టుకున్న ఇప్పలపల్లికి చెందిన ఓదెల కార్తీక్‌కు అందజేసినట్లు తెలిపారు.

జల్సాలకు అలవాటుపడి.. చోరీలకు పాల్పడి..

- విద్యుత్ మోటార్లు, వైర్ల దొంగల అరెస్ట్



దొంగల అరెస్టును చూపుతున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

ముస్తాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపిన కథనం మేరకు ముస్తాబాద్ మండలంలోని బందనకల్ శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోపెడ్‌పై అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన పర్వతం శ్రీను, నూనే సాయికుమార్‌లుగా గుర్తించారు. వీరు పాతఇనుప సామను కొనుక్కొని అమ్మగా వచ్చినడబ్బుల ద్వారా కుటుంబాలను పోషించుకునేవారు. జల్సాలకు, కుటుంబ పోషణకు డబ్బులు సరిపోవడం లేదని ఎలాగైనా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో విద్యుత్ మోటార్‌లు, వైర్‌ను రాత్రి సమయంలో దొంగిలించాలనే ఆలోచనకు వచ్చి గజ్వేల్‌కు చెందిన బడే అనిల్, మోతే సాయిలుతో తమ ఆలోచనను పంచుకున్నారు. వారు కూడా అంగీకరించడంతో తెర్లుమద్ది శివారులోని అర్జున్ క్రషర్‌లో నెలరోజుల క్రితం మూడు సెల్ ఫోన్‌లు ఎత్తుకెళ్లారు. అదేరోజున తిరుమల రైస్ మిల్‌లో 4విద్యుత్‌మోటర్‌లు, 20 రోజుల అనంతరం మళ్లీ అర్జున్ స్టోన్ క్రషర్‌లోకి రాత్రిపూట ప్రవేశించి ఏడు టిప్పర్ బ్యాటరీలు, ట్రాక్టర్ బ్యాటరీ ఇతర ఇనుప వస్తువులు ఎత్తుకెళ్లారని తెలిపారు. అలాగే మండలంలోని పోత్గల్, మద్దికుంట, చీకోడ్, మోర్రాపూర్, గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్దగల విద్యుత్ మోటార్లు, వైర్లు ఎత్తుకెళ్లారని వివరించారు. వారి వద్ద ఉన్న మోటార్లు, బ్యాటరీలు స్వాధీనం చేసుకొన్నామని, వాటి విలువ దాదాపు రూ4 లక్షలు ఉంటుందన్నారు. పర్వత శ్రీను, నూనే సాయికుమార్ లను పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మిగతా నేరస్థులు పరారీలో ఉన్నారని తెలిపారు. దొంగతనాలను చేధించిన ఎస్సై సీహెచ్ గణేశ్, పీసీలు ఎండీ ఖాసీం, రాజశేఖర్, టి నరేశ్‌లను డీఎస్పీ అభినందించారు.

ఆంజనేయస్వామి విగ్రహం అపహరణ

జగిత్యాలరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ పాటిమీది మల్లన్న సమీపంలో గల ఆంజనేయ పురాతన విగ్రహాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్లు కల్లెడ గ్రామస్థులు తెలిపారు. ఈవిషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

రౌడీ షీటర్లకు సీఐ కౌన్సెలింగ్

జ్యోతినగర్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో పలువురు రౌడీ షీటర్లకు రామగుండం సీఐ గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ మంచి ప్రవర్తనను కలిగి ఉండాలని తెలిపారు. ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పకుండా తమ పనులు చేసుకోవాలని, ప్రజలను ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సబ్ రిజిస్ట్రార్‌పై కొనుగోలుదారుడి ఆగ్రహం

- ఒకే సర్వేనంబర్‌లో ఒకటి చేసి మరొకటి రిజెక్ట్
- ఎన్‌వోసీ తీసుకొచ్చినా చేయని వైనం


ఆందోళన చేస్తున్న భూమయ్య

గంగాధర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగాధర అదనపు బాధ్యతలు చేపడుతున్న సబ్‌రిజిస్ట్రార్ కావాలని రిజిస్ట్రేషన్లను తిరస్కరిస్తున్నాడని కొనుగోలు దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన రేణిగుంట భూమయ్య అదేగ్రామంలో సర్వే నంబర్ 371B15లో 232 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. అయితే ఈనెల 3న డాక్యుమెంటుతో గంగాదర రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు వచ్చాడు. పరిశీలించిన సబ్‌రిజిస్ట్రార్ ఈ నంబర్లు నిషేధిత జాబితాలో ఉన్నాయని, జిల్లా కలెక్టర్ నుంచి ఎన్‌వోసీ తీసుకువస్తే చేస్తానని భూమయ్యకి తెలిపాడు. దీంతో భూమయ్య రామడుగు తహసీల్దార్ నుంచి ఈ నంబరుపై ఎన్‌వోసీ తీసుకువచ్చాడు. గురువారం కార్యాలయానికి వచ్చిన భూమయ్య రిజిస్ట్రేషన్ చేయాలని సబ్‌రిజిస్ట్రార్‌ను కోరాడు. ఇది నిషేధిత జాబితాలో ఉంది నేను చేయనని డాక్యుమెంటును తిరిగి పంపించాడు. దీంతో భూమయ్య సబ్ రిజిస్ట్రార్‌తో ఇదే సర్వేనంబరులో 18ఆగస్టు 2025న మీరేడాక్యుమెంటు రిజిస్ట్రేషన్ చేశారు, నాది ఎందుకు చేయడంలేదని వాగ్వాదానికి దిగాడు. అయితే డబ్బులు ఇవ్వనందుకే రిజిస్ట్రేషన్ చేయడంలేదని భూమయ్య ఆరోపిస్తున్నాడు. దీనిపై సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ సర్వేనంబరు నిషేధిత జాబితాల్లో ఉంది. చేయడానికి నా పరిధి కాదు అయినా చేయాలని డిమాండ్ చేశాడు. నేను ఎవరిని ఎలాంటి ప్రలోభాలకు గురి చేయలేదన్నాడు.

లారీ ఢీకొని యువకుడికి గాయాలు

మంథని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గంగాపురి వద్ద లారీ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో స్థానిక పోచమ్మ వాడకు చెందిన లక్కాకుల సంతోష్ అనే యువకుడు బుధవారం సాయంత్రం గాయపడ్డారు. గంగాపురిలో తనపని ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో మంథని నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో సంతోష్ గాయ పడ్డాడు. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య


నీరటి రాజు(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగారం గ్రామానికి చెందిన నీరటి రాజు(30) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి పోచమ్మ తెలిపిన వివరాల మేరకు రాజు అతిగా మద్యం తాగేవాడు. రాజు భార్య ఈనెల3న ఇద్దరు కుమారులను తీసుకొని తల్లిగారి ఊరైన ముత్తారం మండలం పారుపల్లికి వెళ్లింది. మద్యం మత్తులో గురువారం గంగారంలో ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

- తల్లి ఆత్మహత్య ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని మల్యాలలో యువకుడు
- పాస్‌పోర్టు ఇవ్వడం లేదని జగిత్యాలలో మరో యువకుడి ఆత్మహత్యాయత్నం


పోలీస్‌స్టేషన్ గేట్‌పై పెట్రోల్ డబ్బాతో ఉన్న మహ్మద్ అఖిల్‌ను ఆపుతున్న సిబ్బంది

మల్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మల్యాల పోలీస్‌స్టేషన్ మెయిన్‌గేట్ ఎక్కి మహ్మద్ అఖిల్ అనే యువకుడు గురువారం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో వెంటనే పోలీసులు, ఇతరులు పెట్రోల్ డబ్బా లాక్కొని ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా మహ్మద్ అఖిల్ మాట్లాడుతూ తన తల్లి అన్వరీబేగం ఆత్మహత్య ఘటనకు కారకులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించాడు. మల్యాల మండలం నూకపల్లి అర్బన్‌హౌసింగ్ కాలనీకి చెందిన అన్వరీబేగం గత నెల 9న ఆత్మహత్యకు పాల్పడింది. అయితే తన తల్లి ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులు, కారకులైన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తాను ఎస్పీ దగ్గరకు వెళతానని మహ్మద్ అఖిల్ చెప్పడంతో గురువారం ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే మరికొంత మందికి కూడా తనతల్లి ఆత్మహత్యలో భాగస్వామ్యం ఉందని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ఆత్మహత్యయత్నం చేశాడు. ఈవిషయమై మల్యాల ఎస్సై నరేశ్ కుమార్‌ను సంప్రదించగా ఆత్మహత్య ఘటనలో ఫిర్యాదు వచ్చిన వ్యక్తిపై విచారణ జరుపుతున్నామని కేసు విచారణ కొనసాగుతోందని తెలిపారు.

పాస్‌పోర్టు ఇవ్వడం లేదని యువకుడి ఆత్మహత్యాయత్నం..

జగిత్యాల టౌన్: కన్సల్టెన్సీ నిర్వాహకులు పాస్‌పోర్టు ఇవ్వడం లేదని గురువారం నిద్రమాత్రలు మింగి అయితం శ్రీకాంత్ అనే యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలం బొంకూరు గ్రామానికి చెందిన అయితం శ్రీకాంత్ జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీక్రిష్ణ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ తరఫున గల్ఫ్ పంపుతా అంటే నెలరోజుల క్రితం పాస్‌పోర్టు ఇచ్చాడు. వీసా రాక ముందే వైద్య పరీక్షలు చేయించుకోవాలని వారు చెప్పగా రూ.7వేలు చెల్లించి చేయించుకున్నాడు. ఆఫర్ లెటర్ అడిగితే ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ముందు ఒప్పందం చేసుకున్న విధంగా కాకుండా పనిభారం 12గంటల వరకు పెంచి, భోజన వసతి జీతంలోంచి చెల్లించాలని పేర్కోన్నారని తెలిపాడు. అలా అయితే వద్దని తన పాస్‌పోర్టు ఇవ్వాలని కోరగా తిప్పించుకుంటున్నారని ఆరోపించాడు. పాస్‌పోర్టు ఇవ్వకపోవడంతో గురువారం కన్సల్టెన్సీకి వచ్చిన శ్రీకాంత్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వెంటవచ్చిన కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో..

చికిత్స పొందుతూ ఐదుగురు మృతి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో వివిధ సందర్భాల్లో గాయపడి, ఆత్మహత్యాయత్నం చేసుకుని చికిత్స పొందుతున్న ఐదుగురు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..

ఎల్బాకలో..

వీణవంక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన తప్పెట అనిల్(26) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గతనెల 24వ తేదీన అనిల్‌ను అదేగ్రామానికి చెందిన బొట్ల అరవింద్ మరికొందరితో కలిసి గ్రామ చివరున రైస్‌మిల్లు వద్దకు తీసుకెళ్లారు. వారు మద్యం తాగారు. కాగా అనిల్‌కు అరవింద్ తమ్సప్‌లో గడ్డిమందు కలిపి తాగించాడు. దీంతో వాంతులు కాగా గ్రామంలోని ఆర్‌ఎంపీ దగ్గరకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు అనిల్ తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పురుగుల మందు తాగి..

పెద్దపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోజన్నపేట గ్రామానికి చెందిన సింగిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి(44) చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలంగా ఎలాంటి పని చేయకుండా ఖాళీగా ఉండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో రాజేశ్వర్‌రెడ్డి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

కోల్‌సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం ఆఫీస్ బీ గెస్ట్‌హౌస్ కార్నర్ రాజీవ్ రహదారిపై ఈ నెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎల్‌ఐసీ ఏజెంట్ రౌతు రాజన్న(56) చికిత్స పొందుతూ గురువారం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందినట్టు వన్‌టౌన్ ఎస్ఐభూమేష్ తెలిపారు. రాజన్నబైక్‌పై గోదావరి ఖని నుంచి మంచిర్యాల వైపు వెళుతుండగా బీ గెస్ట్‌హౌస్ కార్నర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అతని పరిస్థితివిషమంగా ఉండడంతో కరీంనగర్‌ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. చికిత్సపొందుతూ గురువారంమృతిచెందాడు. మృతుడికుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్టుపోలీసులు పేర్కొన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసి..

కరీంనగర్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కరీంనగర్‌రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన ముస్కు శివ(25) అనే యువకుడు చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శివకు 11 నెలల క్రితం వివాహం జరిగింది. కొన్నినెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్న శివ ఎన్ని ఆసుపత్రుల్లో చూపించుకున్నా నయంకాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల1వ తేదీన మొగ్దుంపూర్ గ్రామ శివారులో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు అతడిని అదేరోజున కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడిశివ తండ్రి నారాయణ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ సీఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై..


ఎల్లుట్ల కృష్ణ(ఫైల్)

కోరుట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో నాలుగు నెలలక్రితం విద్యుదాఘాతానికి గురైన ఎల్లుట్లకృష్ణ (33) గురువారం చికిత్సపొందుతూ మృతి చెందాడు. పట్టణంలో వినాయకవిగ్రహాల తయారీ కేంద్ర వద్ద జూన్15న విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందగా 8మందికి గాయలయ్యాయి. ప్రమాదంలో ఎల్లుట్ల కృష్ణ గాయపడగా కుటుంబసభ్యులు అప్పుడు చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. కొద్దిరోజుల అనంతరం డిశ్చార్జ్ అయ్యాడు. కానీ అతడికి అయిన గాయం మానకపోవడంతో జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో చికిత్సను అందించారు. గురువారం మధ్యాహ్నం తీవ్రఅస్వస్థతకు గురై చికిత్సపొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం గురువారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి 21,954 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు వరదగేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టునుంచి 28,204 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్‌గేట్ల ద్వారా 8వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల

ఇల్లంతకుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటివిడుదల కొనసాగుతోంది. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.43టీఎంసీల నీరు ఉంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి 100 క్యూసెక్కుల నీరు క్యాచ్‌మెంట్ ద్వారా వస్తుండగా, 118క్యూసెక్కుల నీరు సర్‌ప్లస్ గేట్ల ద్వారా విడుదల అవుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు.

ఎల్ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం రెండుగేట్ల నుంచి నీటివిడుదల కొనసాగుతోంది. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.947టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి వస్తున్న 4254క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వస్తుండగా, రెండు స్పీల్‌వేగేట్లు ఒకఫీట్‌మేర ఎత్తి4వేలక్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరిరూపంలో 254క్యూసెక్కులు మొత్తం 4254క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది.


ఎల్ఎండీ నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

క్రమశిక్షణ.. దేశభక్తి

- విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపు
- నేడు భారత స్కౌట్స్, గైడ్స్ ఫౌండేషన్ డే


తాళ్లతో నిర్మించిన బ్రిడ్జిపై శిక్షణ పొందుతున్న గైడ్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినయం, ఔన్నత్యం, సహాయ గుణం కలగలిపి క్రమశిక్షణకు మారుపేరుగా, నైతిక విలువలకు చిరునామాగా ఏర్పడిన ఉద్యమమే స్కౌట్స్ అండ్ గైడ్స్. విద్యార్థులు, యువతలో క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం.

● నేపథ్యం

భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డేను ప్రతి సంవత్సరం నవంబర్ 7న జరుపుకుంటారు. 1950లో ఇదే రోజున దేశంలోని బాయ్ స్కౌట్స్ అసోసి యేషన్, హిందుస్థాన్ స్కౌట్ అసోసియేషన్ విలీన మయ్యాయి. అప్పటి నుంచి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటయింది. ఒక సంవత్సరం తర్వాత 1951 ఆగస్టు 15న ఆలిండియా గర్ల్ గైడ్స్ అసోసియేషన్ కూడా ఈ సంస్థలోనే చేరింది. ఈ నేపథ్యంలో నవంబర్ 7న స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డేను భారతదేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు.


స్కౌట్ శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

● వివిధ రకాల శిక్షణలు

స్కౌట్స్ గైడ్స్‌కు పయనీరింగ్ అంటే ముడులు వేయడం, టెంట్ నిర్మాణం, వంతెనను నిర్మించడం తది తర అంశాలపై శిక్షణ అందిస్తారు. అలాగే ప్రథమ చికిత్స చేయడం, పేషెంట్లను ఎతుకెళ్లే పద్ధతులు, కృత్రిమ శ్వాస అందించడంలో శిక్షణ ఇస్తారు. మ్యాపింగ్ అండ్ కంపాస్‌లలో శిక్షణ ఇస్తారు. అంతర్జాతీయ పటా లను చదవడం, దిక్సూచి ఉపయోగించుకోవడం నేర్పిస్తారు. ఎత్తులు, లోయలు, పొడవు, వెడల్పులను అంచనా వేయడం, ట్రెక్కింగ్, శారీరక ధృడత్వానికి ఫుట్ డ్రిల్, మార్చ్‌ఫాస్ట్, యోగా వంటి వ్యాయామాలు నేర్పిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో 824 ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా స్కౌట్స్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

● ఉన్నత విద్యావకాశాలు

గవర్నర్ సర్టిఫికెట్ : రాష్ట్రస్థాయి పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేస్తారు.

రాష్ట్రపతి సర్టిఫికెట్: గవర్నర్ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు జాతీయస్థాయిలో పరీక్ష నిర్వహించి రాష్ట్రపతి సర్టిఫికెట్లు అందజేస్తారు.

ఉద్యోగ రిజర్వేషన్: రాష్ట్రపతి సర్టిఫికెట్లు సాధించిన వారికి రైల్వే సంస్థతో సహా పలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తారు.

పాఠశాల విద్యకు స్కౌట్స్ అండ్ గైడ్స్ జీవనాధారం



- షరీఫ్ అహ్మద్, ట్రైనింగ్ కమిషనర్

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం పాఠశాల విద్యకు జీవనాధారం. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో తెలివితో పాటు వారి మనసును కూడా మలిచే ఒక జీవన పద్ధతి ఇది. తరగతి గదిలో అందని క్రమశిక్షణ, నడవడి, గౌరవభావం వంటి కీలక లక్షణాలు శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులకు అందుతాయి. పాఠశాల విద్యార్థుల్లో నేను సమాజానికి బాధ్యతగల సభ్యుడిని అనే భావనను పెంచి వారిలో దేశభక్తి, సేవాగుణం, వినయ విధేయతలను పెంపొందిస్తుంది.

పాఠశాల స్థాయిలో క్రమశిక్షణకు చిరునామా



- కంకణాల రాంరెడ్డి, జిల్లా స్కౌట్స్, గైడ్ కార్యదర్శి

స్కౌట్స్ అండ్ గైడ్స్ పాఠశాల స్థాయిలో విద్యార్థుల క్రమశిక్షణకు చిరునామాగా నిలుస్తుంది. యువత భవిష్యత్తుకు జీవన మార్గం చూపెడుతుంది. ఉత్తమ సమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత పాల్గొనేలా చేస్తుంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు స్కౌట్స్, గైడ్స్ యూనిట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. దీంతో సమర్థవంతమైన పౌరసత్వంవైపు బలంగా అడుగులు వేయగలం.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు చెల్పూర్ విద్యార్థి


గాలిబు చరణ్

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న గాలిబు చరణ్ అనే విద్యార్థి అండర్-17లో రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడుళ్ల బయ్యారం గ్రామంలో నిర్వహించే 69వ రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ విద్యార్థి పాల్గొనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై పీడీ చిరుత శ్రీనివాస్, రిటైర్డు పీడీ సొల్లు సారయ్య అభినందించారు.

ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్‌లో రెండు ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుడు జనగం రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున చూసే సరికి తన ఇంటి ముందు నిలిచిఉంచిన రెండు ట్రాక్టర్ల బ్యాటరీలు, రెండు వైబ్రేటర్లు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్ల శిక్షణ శిబిరాలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఖో-ఖో జట్ల శిక్షణ శిబిరాలు గురువారం ముగిశాయి. కరీంనగర్‌లోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ సౌజన్యంతో ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 10 రోజులపాటు మహిళలు, పురుషుల ఖో-ఖో జట్లకు నిర్వహించిన ఈ శిబిరాల్లో 25 మంది పురుషులు, 20 మంది మహిళలు పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్‌రెడ్డి, జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలకు ఎంపికైన మహిళలు, పురుషుల జట్లకు ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో క్రీడాదుస్తులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు ప్రతిభచాటి విజేతలుగా నిలవాలని అన్నారు. శిబిరాల్లో పాల్గొన్న జట్లు పెద్దపల్లి జిల్లాలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖో-ఖో పోటీల్లో పాల్గొననున్నాయి. కార్యక్రమంలో శిక్షణ శిబిరాల నిర్వాహకులు, కోచ్‌లు డాక్టర్ ఎ రవీందర్, కట్ట సంతోష్, రాములు, కరుణాకర్, చిట్టి తిరుపతిరెడ్డి, వి శ్రీలత, రేణుక, పి జ్యోతి, సౌజన్య, సూర్యప్రకాష్, పి ఆనంద్, జలంధర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రపోటీలకు ఎంపికైన ఉమ్మడిజిల్లా మహిళలు, పురుషుల జట్టు

నేడు కరీంనగర్‌కు గవర్నర్ రాక

● 'శాతవాహన' స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు

కరీంనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కరీంనగర్ జిల్లాకేంద్రానికి శుక్రవారం రానున్నారు. ఉదయం 8.15గంటలకు హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి ఆయన రోడ్డు మార్గంలో బయలుదేరి 10.50గంటలకు శాతవాహన యూనివర్సిటీకి చేరుకుంటారు. అక్కడ 12.30గంటల వరకు యూనివర్సిటీ ద్వితీయ స్నాత కోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారు. అనంతరం గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులకు మెడల్స్‌ను ప్రదానం చేస్తారు. మధ్యాహ్నం 12.30గంటలకు భోజనంచేసి 1.45నిమిషాలకు బయలుదేరి రెండు గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. రెండు గంటల నుంచి 2.15గంటల వరకు స్థానికులు తయారు చేసిన హ్యాండిక్రాఫ్ట్స్, సిల్వర్ ఫిలిగ్రీ, ఆహారపదార్థాల స్టాల్స్‌ను సందర్శిస్తారు. 2.15 నుంచి మూడు గంటల వరకు అక్కడే కలెక్టర్, టీబీ అధికారులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3నుంచి 3.45గంటల వరకు రచయితలు, కవులు, కళాకారులు, వివిధ రంగాల్లో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో అవార్డులు పొందిన అవార్డు గ్రహీతలతో గవర్నర్ ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.50 గంటలకు కలెక్టరేట్ నుంచి బయలుదేరి సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ రాజ్‌భవన్‌కు చేరుకుంటారని రాజ్‌భవన్‌వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు.

కొనసాగుతున్న గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని గురువారం ధర్మపురి వద్ద గోదావరి హారతి నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోకక్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. రాత్రివేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్యఅర్చకులు నంబి శ్రీనివాసాచారి, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, ధర్మకర్త రాపర్తి సాయికిరణ్, శారదా మహిళా మండలి, వాసవి మహిళామండలి సభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపు సభ్యులు, పెద్దపల్లి శ్రీవల్లి సేవా గ్రూపు సభ్యులు, స్థానిక మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చొప్పదండి ప్యాక్స్‌ను సందర్శించిన పుణే విద్యార్థుల బృందం

చొప్పదండి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ప్రాథమిక సహకార సంఘాన్ని పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ విద్యాలయంలో పీజీడీఎం చదువుతున్న విద్యార్థుల బృందం గురువారం సందర్శించింది. సహకార రంగంలో వృత్తిపరమైన విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు క్షేత్రస్థాయి అనుభవాన్ని అందించే లక్ష్యంతో బృందం చొప్పదండి ప్యాక్స్‌ను సందర్శించి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్యాక్స్‌చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, జిల్లాసహకార అధికారి రామానుజచార్యులు సంఘం యొక్క కార్యకలాపాలు, పనితీరు, రైతులకు అందిస్తున్న సేవలు, సంఘంఅభివృద్ధి గురించి వివరించారు. సంఘం జాతీయ స్థాయిలో ఉత్తమ ప్యాక్స్‌గా అవార్డు అందుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ముద్దం మహేష్‌గౌడ్, సీఈవో కళ్లెం తిరుపతి రెడ్డి, సభ్యులు గుర్రం ఆనంద్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, నాంపల్లి మల్లయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.


చొప్పదండి సహకార సంఘంలో విద్యార్థుల బృందం

యధాతథంగా పత్తి కొనుగోళ్లు

● మిల్లర్లు ఇచ్చిన బందు పిలుపు వాయిదా


మార్కెట్లోకి వచ్చిన పత్తి

జమ్మికుంట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్ యార్డులో సీసీఐ, ప్రైవేట్‌వ్యాపారుల కొనుగోళ్లు గురువారం యధాతథంగా కొనసాగాయి. నిబంధనలు సడలించాలని డిమాండ్‌చేస్తూ జిన్నింగ్‌మిల్లర్లు పత్తికొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అందుబాటులో లేకపోవడంతో జిన్నింగ్ మిల్లర్లు తాత్కాలికంగా పత్తికొనుగోళ్ల బంద్‌ను వాయిదా వేసుకున్నారు. గురువారం మార్కెట్‌యార్డుకు 61 మంది రైతులు 487క్వింటాళ్ల విడిపత్తి, ఐదుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనేసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.6800, కనిష్ఠ ధర రూ.5700 చెల్లించి కొనుగోళ్లుచేపట్టారు. సీసీఐఐదుగురు రైతుల నుంచి 69క్వింటాళ్ల మద్దతు ధర ప్రకారం కొనుగోళ్లు చేపట్టింది.

కాలువలకు వెంటనే మరమ్మతులు చేయాలి

● సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కాలువలను వెంటనే మరమ్మతు చేయాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలుగ్రామాలను ఆయన సందర్శించారు. దెబ్బతిన్న కాలువలను, వరిపంటలను పరిశీలించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలుమండలాల్లో దెబ్బతిన్న, ప్యాకేజీ-3లో పెండింగ్‌లో ఉన్న పనులు, భూసేకరణ లాంటి కార్య క్రమాలు నిర్వహించడానికి దాదాపు 67కోట్లు కావాలని కోరుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీలో నిలిచిపోయిన పనులకు వెంటనే టెండరు పిలవాలని కోరారు. ఆయనవెంట సీపీఐ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


రేకొండలో ఇటీవల వర్షాలకు తెగిన రోడ్లను పరిశీలిస్తున్న చాడ వెంకటరెడ్డి

పారిశ్రామికాభివృద్ధిలో ఎన్టీపీసీ కీలకం

- నేడు ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం
- బహుళ రంగాల్లో ప్రగతి



జ్యోతినగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశీయ విద్యుత్ అవసరాలను తీర్చడంతోపాటు ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధిలో ఎన్టీపీసీ కీలకపాత్ర పోషిస్తున్నది. దేశంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో నాల్గవ వంతు ఎన్టీపీసీ అందిస్తోంది. విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ఎన్టీపీసీ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాన్ని విస్తరిస్తోంది. థర్మల్ విద్యుత్ కేంద్రాలతో ప్రారంభమైన ఎన్టీపీసీ ప్రయాణం గ్యాస్, నాఫ్తా ఆధారిత ప్రాజెక్టులు, జలసాంప్రదాయేతర (సోలార్, పవన) విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పింది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో జాయింట్ వెంచర్లు, అనుబంధ సంస్థలతో వ్యాపారాన్ని నిర్వహిస్తున్నది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌గా ఉన్న ఎన్టీపీసీ దశాబ్దం క్రితం ఎన్టీపీసీ లిమిటెడ్‌గా అవతరించింది. 23 బొగ్గు ఆధారిత(థర్మల్), 7 గ్యాస్(నాఫ్తా), 15 సోలార్ ప్రాజెక్టులు, 2 జల విద్యుత్ ప్రాజెక్టులు, ఒక విండ్, 9 జాయింట్ వెంచర్(సంయుకత్త రంగం)లో మొత్తం 48 ప్లాంట్లను నిర్వహిస్తోంది. ప్రస్తుతం 84,849 మెగా వాట్ల స్థాపిత సామర్థ్యంగల సంస్థ 2032 నాటికి 1.28 లక్షల మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించడానికి ప్రణాళికలను రూపొందించింది. 1975 నవంబరు 7న నేషనల్ థర్మల్ పవర్ కార్పొ రేషన్(ఎన్టీపీసీ) పేరుతో పబ్లిక్ సెక్టార్ సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అంచెలంచెలుగా ఎదిగిన ఎన్టీపీసీ శుక్రవారంతో 50 ఏళ్లు పూర్తి చేసుకొని 51వ వసంతంలోకి అడుగు పెడుతున్నది.


రామగుండంలోని ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు

● పలు అవార్డులు

50 ఏళ్లలో ఎన్టీపీసీకి ఉత్పత్తి, సేఫ్టీ, సీఎస్ఆర్, మానవ వనరులు, పర్యావరణ పరిరక్షణ, పరిపాలన, నాణ్యత, బెస్ట్‌ప్లేస్ టూ వర్క్ తదితర అన్ని రంగాలలో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. గతంలోనే ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్‌గా ప్లాట్స్ సంస్థ ఎన్టీపీసీకి ప్రపంచంలో మొదటి ర్యాంకు ప్రకటించింది. ఫోర్బ్స్ ర్యాంకింగ్స్‌లో ఎన్టీపీసీకి 4వ స్థానం, నాలుగు ఆర్థిక సంవత్సరాలుగా డున్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ నుంచి బెస్ట్ పెర్ఫార్మింగ్ సంస్థగా గుర్తింపు సాధిస్తూ వస్తోంది.

● బొగ్గు గనుల నిర్వహణ..

దేశంలో అత్యధిక బొగ్గును ఎన్టీపీసీ వినియోగిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో 300 మిలియన్ టన్నుల బొగ్గును ఉపయోగించింది. యేటా సంస్థ స్థాపిత సామర్థ్యం (థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటు) పెరుగుతుండడంతో బొగ్గును ఎక్కువ మొత్తంలో ఉపయోగించాల్సి వస్తోంది. బొగ్గు కొరతను ఎదుర్కొనడానికి దేశవ్యాప్తంగా 10 బొగ్గు బ్లాకులు(107 బిలియన్ మెట్రిక్ టన్నులు) ఎన్టీపీసీకి ఉన్నాయి. ప్రస్తుతం నెలకొన్న పోటీతో పాటు ముడి ఇంధన సమస్యలను అధిగమిం చేందుకు ఎన్టీపీసీ లిమిటెడ్ సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి విధానం అమలు చేస్తున్నది. సంస్థ సాంప్రదాయేతర పద్ధతుల ద్వారా చిన్న విద్యుత్ కేంద్రాలను నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొం దించింది. సాంప్రాదాయేతర ఇంధన వనరుల ద్వారా 50,000 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఎన్టీపీసీ భావిస్తున్నది. దీనిలో ప్రధానంగా సోలార్, పవన, జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టిసారించింది.

పది పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలి

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న వికాస్‌రావు

చందుర్తి నవంబరు 6(ఆంధ్రజ్యోతి):ప్రధాని మోదీ కానుకగా కేంద్ర హోం శాఖసహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అందిస్తున్న ఉచిత సైకిళ్లను చందుర్తి,మల్యాల గ్రామాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వేములవాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమ నేని వికాస్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు పరిధిలో 20వేల సైకిళ్లను పంపిణీ చేయాలని బండి సంజయ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు మోదీ కిట్ పేరుతో సహాయాన్ని అందించడానికి ప్రణాళికలు రూపొం దిస్తున్నట్లు, పది వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధన కోసమే ఎంపీ బం డి సంజయ్ కుమార్ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వినయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ప్రతిభ, శరత్‌చంద్ర, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్, మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్, జిల్లా ప్రధానకార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, నాయకులు మార్త సత్తయ్య, పొం చెట్టి రాకేష్, పెరుక గంగరాజు, పేరుక రంజిత్, మర్రి మల్లేశం, హనుమయ్య చారీ, చింతకుంట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు హక్కుల సాధనకు ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శ విమల అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 14 వ జాతీయ మహా సభలకు సంబంధించిన కర పత్రాలను స్థానిక మహిళలతో కలిసి గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను రూపొందించి కఠిన శిక్షలు అమలు చేయాలని అన్నారు. హక్కుల సాధనకు ప్రతిమహిళ నడుం బిగించాలన్నారు. జాతీయ మహా సభ లకు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని విమల కోరారు. అనంతరం మండల కమిటీని నియమించారు. మల్లారపు నర్సవ్వ, కోనేటి లక్ష్మీ, గౌరి భారతి, కంపోజ శకుంతల, నీల కవిత, గడ్డం రుచిత, గొల్లపల్లి రేణుకలు సభ్యులుగా వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి కారణమైన సంఘటనలో గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లోని వ్యక్తి శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 4న వీర్నపల్లి మండలం బంజేరు గ్రామానికి చెందిన పర్లపల్లి దేవరాజు తన కూతురును అతని స్నేహితుడు భూక్య కళ్యాణ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాల సాంఘీక సంక్షేమ వసతి గృహంలో దింపేందుకు బయలుదేరారన్నారు. తిరిగి వస్తున్న క్రమంలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో శ్రీనివాస్‌రెడ్డి తన బైక్‌తో అతివేగంగా ఢీకొట్టాడని చెప్పారు. ప్రమాదంలో దేవరాజు కాలు విరిగిపోయిందని, అతని స్నేహితుడు కళ్యాణ్‌కు ఎలాంటి గాయాలు కాలేవని పేర్కొన్నారు. బాధితుడు దేవరాజు భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

కొనసాగిన సీసీఐ పత్తి కొనుగోళ్లు

వేములవాడ టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ మండలంలోని సంకెపల్లిలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోళ్లు యధావిధిగా కొనసాగాయి. జిన్నింగ్ మిల్లు యాజమాన్యం సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందుకు స్పందించిన ప్రభుత్వం జిన్నింగ్ మిల్లుల యాజమాన్యంతో చర్చలు సఫలమవడంతో సమ్మె విరమించారు.

నలుగురు విద్యార్థులకు బంగారు పతకాలు



రాజ్‌కుమార్, అనూష, శ్రీ చరణ్, ప్రియదర్శిని

వేములవాడ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వరస్వామి సంస్కృత డిగ్రీ కళాశాలలో చదివిన నలుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్‌కు ఎంపికయ్యారు. సంస్కృత కళాశాలలో బీఏ(ఎల్) డిగ్రీలో అత్యధిక మార్కులు సాధించిన ఉరుముల రాజ్‌కుమార్(2019-20), కెంద అనూష (2020-21), నరంబట్ల శ్రీ చరణ్(2021-22), కనక ప్రియదర్శిని (2022-23)లనే నలుగురు విద్యార్థులు శాతవాహన యూనివర్సిటీలో శుక్రవారం జరిగే కాన్వొకేషన్‌లో వేములవాడలో సంస్కృత ఉపన్యాసకులుగా పనిచేసిన దివంగత నందగిరి అనంత రాజశర్మ స్మారకార్థం గోల్డ్ మెడల్ అందుకోనున్నారు.

అంత్యక్రియలను అడ్డుకున్న తహసీల్ అధికారులు

- ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ అభ్యంతరం..

- అధికారులతో కుల సంఘం సభ్యుల వాగ్వాదం

- పట్టాభూమిగా నిర్ధారణ కావడంతో ఖననం..



కుటుంబ సభ్యులు, కుల పెద్దలతో మాట్లాడుతున్న తహసీల్ అధికారులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో తహసీల్ అధికారులు చేరుకుని అడ్డుకున్న సంఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. గ్రామంలోని రాములు(68) నాలుగు రోజులు కిందట అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. గ్రామశివారులోని భూమిలో వారి ఆచారం మేరకు మృతదేహాన్ని ఖననం చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ భూమిలో సమాధి చేస్తున్నారంటూ గుర్తు తెలియని వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు తహసీల్ అధికారులు అడ్డుకున్నారు. గత కొన్నేళ్లుగా సమాధి చేస్తున్నామని అధికారులతో కుల సంఘం సభ్యులు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ బాలరాజు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అది ప్రభుత్వ భూమి కాదని పేర్కొన్నారు. సర్వే నంబర్‌ను పరిశీలించిన అధికారులకు పట్టా భూమిగా తేలడంతో వెనుదిరిగారు. అనంతరం కుటుంబీకులు, కుల సంఘం సభ్యులు మృతదేహాన్ని ఖననం చేశారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దార్ మురళీకృష్ణను వివరణ కోరగా, ప్రభుత్వ భూమిలో మృతదేహాన్ని పూడ్చివేస్తున్నారనే సమాచారంతో తమ సిబ్బందిని అక్కడకు పంపించామని పేర్కొన్నారు. తమ సిబ్బంది ఎవరూ అడ్డుకోలేదని, భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించగా పట్టా భూమి అని తేలడంతో అంత్యక్రియలకు అభ్యంతరం వ్యక్తం చేయలేదని వివరించారు.

తహసీల్దార్ కార్యాలయం పనులు పూర్తిచేయాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



తహసీల్దార్ కార్యాలయ పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

తంగళ్లపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా సూచించారు. గురువారం తంగళ్లపల్లి మండలం పరిషత్ ఆవరణలో నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జయంత్ పనుల పురోగతిని వివరించారు. పక్షం రోజుల్లో కార్యాలయాన్ని తరలిస్తామన్నారు.

రాళ్లపేట పాఠశాల సందర్శించిన కలెక్టర్..

మండలంలోని రాళ్లపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంతమంది విద్యార్థులు ఉన్నారు..? విద్యార్థులకు అందిస్తున్న బోధన, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు శారద పాఠశాలలో ఒకే తరగతి గది ఉందని అదనపు తరగతి గది నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు. అదనపు తరగతికి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించాలి..

మండలంలోని రాళ్లపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించాలని స్థానిక మహిళలు ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో 157 సర్వే నంబరులోని 2 గుంటల స్థలాన్ని విరాళంగా ఇచ్చారని, అందులో అంగన్‌వాడీ శాశ్వత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. శాశ్వత భవనం లేక చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు విమల, నిరోశ, హరిశ, శివాణి, మమత, లత తదితరులు వినతి పత్రంలో కోరారు.

మొలకెత్తిన ధాన్యం తూకం వేయాలి : ఆర్డీవో



రుద్రంగిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రాధాబాయి

చందుర్తి నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో వర్షంతో తడిసి మొలకెత్తిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు ఆర్డీవో రాధాబాయి సూచించారు. చందుర్తి మండల కేంద్రంతో పాటు రామన్నపేట తిమ్మాపూర్ ఆసిరెడ్డిపల్లి నర్సింగాపూర్ మూడపల్లి గ్రామాల్లోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆయా కేంద్రాల్లో రైతులను ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. రైతులు మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. లారీల కొరత ఉన్నదని చెప్పారు. లారీలు మూడు నాలుగు రోజులకు ఒకసారి వస్తున్నాయని రైతులు వాపోయారు. కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా కేంద్రాల నిర్వహకులు టార్పలీన్ కవర్లు కప్పి భద్రపరచాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు ఆర్‌ఐలు శ్రీనివాస్, మహేందర్ ఐకెపి సిబ్బంది ఉన్నారు.

● రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాన్ని గురువారం వేములవాడ ఆర్డీవో రాధాబాయి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ధాన్యం కుప్పల వద్ద తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తేమ శాతం వచ్చిన ధాన్యంను వెంటవెంటనే కొనుగోలు చేసి తరలించాలన్నారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, గడ్డం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఇల్లంతకుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. మండలంలోని దాచారం, వెల్జీపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందించాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలన్నారు. తూకంలో వేగవంతం చేయాలని, తూకంవేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. కేంద్రాల్లో ఏమైన ఇబ్బందులు ఏర్పడితే అధికారులకు సమాచారం అందివ్వాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం చింతలకుంటపల్లె గ్రామంలోని రైస్‌మిల్లును పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం లతామంగేశ్వరితో పాటు అధికారులు, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తున్న గ్రామస్థులు

ఇల్లంతకుంట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : గుంతలమయంగా మారి ప్రయాణీకులకు ఇబ్బందికరంగా తయారైన రహీంఖాన్‌పేట రోడ్డుకు గురువారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రహీంఖాన్‌పేట గ్రామం నుంచి ఎర్రనర్సుపల్లె గ్రామం మధ్య రోడ్డు పూర్తిగా చెడిపోయింది. గతంలో ప్రభుత్వం బీటీరోడ్డు రిన్యువల్‌కు నిధులు మంజూరు చేసినా పనులు మధ్యలో నిలిచిపోయాయి. రోడ్డు చెడిపోయిందని ప్రభుత్వం దృష్టికి తీసుకవచ్చినా స్పందన లేకపోవడంతో మాజీ సర్పంచ్ బిల్లవేని పర్శరాం, మాజీ ఉపసర్పంచ్ బత్తిని స్వామిల ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీంతో పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కముటం లక్ష్మయ్య, కముటం రాజయ్య, కముటం పర్శరాం పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గుంత..



ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత

ఎల్లారెడ్డి పేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని చిట్టి వాగు వంతెన వద్ద కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై గుంత పడి ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎన్నికల ప్రచారానికి తరలిన నాయకులు

చందుర్తి నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):చందుర్తి మండల కాంగ్రెస్ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు జూబ్లీహిల్స్‌కు తరలివెళ్లారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భీమరాజు కనకరాజు, నాయకులు దొంతుల మహిపాల్‌రెడ్డి, తిప్పని నర్సయ్య, తిప్పనిశంకర్, బొడ్డు శంకర్, కోట అనిల్ కుమార్ ఉన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కోనరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కోనరావుపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ఫాక్స్ ఛైర్మన్ బండ నర్సయ్య, మండల అధ క్షుడు ఫిరోజ్ పాషా, చేపూరి గంగాధర్, బొర్రా రవీందర్, సుంకరి రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

గంభీరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు చేపట్టిన పనులు, కూలీలకు చెల్లించిన వేతనాలను తనిఖీ చేయడానికి సామాజిక బృందం ఎస్‌ఆర్‌పీతో పాటు 10మంది డీఆర్‌పీలు ఆయా గ్రామాల్లో పనులు తనిఖీ చేసి తయారు చేసి నివేదికను ప్రజావేదికలో చర్చించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి శేషాద్రి సమక్షంలో గ్రామాల వారిగా నివేదికలను చదివి వినిపించారు. మస్టర్లు దిద్దుబాటు, కొట్టివేతలు ఉండటం వల్ల పంచాయతీ కార్యదర్శులకు, క్షేత్ర సహాయకులకు 39,367 రూపాయల రికవరీ విధించారు. ఈ సామాజిక తనిఖీ ప్రజావేదికలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, మండల అభివృద్ధి అధికారి రాజేందర్, జిల్లా విజిలెన్స్ అధికారి రామారావు, అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ అరుణ్, అంబుడ్స్‌మెన్ రాకేష్, క్వాలిటీ కంట్రోలర్ నవీన్‌కుమార్, అదనపుకార్యక్రమ అధికారి అరుణ, ఎస్‌ఆర్‌పీ బాలు, ఏఈపీఆర్ వేణు, జూనియర్ ఇంజనీర్ శ్రీహరి, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- మత్స్యపారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం



ఎగువ మానేరు జలాశయంలో చేప పిల్లలను వదులుతున్న నాయకులు

గంభీరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయంలో గురువారం 10లక్షల 50వేల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం పెద్దఎత్తున ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమా న్ని చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా కోటి 50 లక్షల చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టగా, అందులో భాగంగా మానేరులో చేప పిల్లలను వదలడం జరిగిందన్నారు. ఉచిత చేప పిల్లలతో పాటు ప్రభుత్వం మత్స్యకార్మికుల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో సౌజన్య, వ్యవసా య మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి, తహసీల్దార్ మారుతిరెడ్డి, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ గాడిచర్ల శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ కిరణ్, మార్కెట్ ఛైర్మన్ నాగారం దేవేందర్, ముదిరాజ్ మండల అధ్యక్షుడు చాత్రబోయిన లక్ష్మన్, జిల్లా ఉపాధ్యక్షుడు శివంది దేవేందర్, మండల కోశాధికారి తోక దేవదాస్ తదితరులు ఉన్నారు.

'ఉపాధి'కి ఆధార్ లింక్..

(5వ పేజీ తరువాయి)

కూలీలు ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు 1.50 లక్షల మంది కూలీల ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తిచేసి ఆధార్ అనుసంధానం చేశారు. ఇందులో యాక్టివ్ కూలీలకు సంబంధించి 86.87 శాతం ఈ-కేవైసీ పూర్తిచేశారు. జిల్లాలో 1,96,420 మంది కూలీలు ఉండగా, మహిళలు 1,00,013 మంది ఉన్నారు. ఇందులో ఎస్సీలు 51,774 మంది, ఎస్టీలు 15,174 మంది, ఇతరులు 1,29,560 మంది ఉన్నారు. ఇందులో యాక్టివ్ జాబ్‌కార్డులు 60,244 ఉండగా, కూలీలు 91,564 మంది ఉన్నారు. వీరిలో మహిళలు 55,650 మంది ఉండగా ఎస్సీలు 23,358 మంది, ఎస్టీలు 9,407మంది, ఇతరులు 58,799 ఉన్నారు. వీరికి సంబంధించి 91,529 మంది కూలీల ఈ-కేవైసీ చేశారు. 86.87శాతం ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లాలోని 1,96,420 మొత్తం కూలీల్లో 1,50,441 మంది ఈ-కేవైసీ సేకరించారు. ఇందులో 62.67శాతం 94,277 మంది కూలీల ఆధార్ అనుసంధానం పూర్తి చేశారు. ఈనెలాఖరులోగా వంద పూర్తి చేసే దిశగా అధికారులు దృష్టి సాధించారు.

ధాన్యం తూకంవేసిన వెంటనే రసీదులు ఇవ్వాలి



కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఇల్లంతకుంట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే రైతులకు రసీదులు ఇవ్వాలని రైతుకూలీ సంఘ రాష్ట్ర కోశాధికారి బామండ్ల రవీందర్ పేర్కొన్నారు. మండలంలోని ముస్కానిపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, తడిసిన వడ్లను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలలో అమలవుతున్న నిబంధనల వల్ల రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. ధాన్యాన్ని తూకం వేసిన హమాలీల డబ్బులు ప్రభుత్వమే భరించాలన్నారు. తరుగు పేరుతో కటింగ్ విధించడం వల్ల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ఆరుగాలం కష్టపడి ధాన్యాన్ని పండించిన రైతులను దోచుకునే విధానాన్ని వెంటనే విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మూషం అంజనేయులు, కనుకయ్య, లచ్చయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాలు

చందుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాలు అందించాలని రుద్రంగి ఏఎంసీ ఛైర్మన్ చెలకల తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం అలింకో సంస్థ ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులని వివక్షత చూపవద్దని, అందరితో సమానంగా గౌరవించాలని పేర్కొన్నారు. దివ్యాంగులు యూడీఐడీ కార్డు కోసం మొబైల్ లేదా మీసేవా ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. అర్హత సాధించిన వారికి చేతి, చంక కర్రలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, టెట్రాప్యాడ్, మోకాళ్ల పట్టీలు మొదలైన సహాయక పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు కావలసిన పత్రాలు వెంట తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సీడీపీవో సౌందర్య, ఏసీడీపీఓ సుచరిత, ఎంపీడీవో రాధా, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ బొజ్జ మల్లేశం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, మమత, కోఆర్డినేటర్ రోజా తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

చందుర్తి నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి వి. రవీందర్ రెడ్డి అన్నారు. చందుర్తి మండలంలోని మర్రిగడ్డ, కట్ట లింగంపేట గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇందిరమ్మ ఇళ్లతో పాటు, నిర్మాణం పూర్తయిన ఇళ్లను, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మర్రిగడ్డలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు గన్నీ సంచుల కొరత ఉందని మండల ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకురాగా, వెంటనే డీసీఎస్‌వో చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లుకు తరలించాలన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి బి. ప్రదీప్ కుమార్, ఐకెపి సీసీలు, వివోఏలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రుద్రంగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలోని ప్రహ్లాద పర్వతంపై వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రథోత్సవం భక్తులు, భజనల మధ్య గ్రామంలోని వీధుల గుండా సాగింది. మహిళలు పెద్ద సంఖ్యలో స్వామివారికి మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు, ఎస్‌ఐ శ్రీనివాస్ భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కోమిరె శంకర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతి, అలయ వైస్‌చెర్మన్ దాసరి గంగారాజం, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, బాసని ఓంప్రకాష్, పడాల శంకరయ్య, ఆకుల వేంకటి, దయ్యాల శ్రీనివాస్, గంగారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతంగా జరిగేలా చూడాలి

ముస్తాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ముస్తాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తలారి రాణినర్సింలు పేర్కొన్నారు. మండలంలోని నామాపూర్, మద్దికుంట, మోహినికుంట, చీకోడ్, వెంకట్రావుపల్లె గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను గురువారం ఏఎంసీ ఛైర్మన్ తలారి రాణినర్సింలు సందర్శించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. రైస్‌మిల్లులకు వెంటవెంట ధాన్యం తరలించాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. లారీల సమస్య ఉందని సెంటర్ నిర్వాహకులు పేర్కొనగా సంబంధిత కాంట్రాక్టరుతో మాట్లాడి లారీల కొరత ఉండొద్దని, వెంటవెంట లారీలను పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు కదిరే సత్యంగౌడ్, మామిళ్ల శ్రీకాంత్, నిర్వాహకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వేములవాడ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాలరాజుపల్లికి చెందిన నాగుల రమేష్(27) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగుల రమేష్ గల్ఫ్ నుంచి కొద్ది రోజుల క్రితమే స్వదేశానికి వచ్చాడు. సోమవారం కొమురవెల్లికి వెళ్లిన రమేష్ అక్కడే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కడి పోలీసులు తల్లిదండ్రులు లక్ష్మి,శ్రీనివాస్‌లకు సమాచారం అందించడంతో వారు రమేష్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రమేష్‌ను ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ నాగుల రమేష్ గురువారం రాత్రి మృతిచెందాడు. కొడుకు మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.